

# సమస్యలు - పరిష్కారాలు

## - డా.యండమూరి వీరేంద్రనాథ్



త్వరలో ప్రచురణ కాబోతున్న పుస్తకం నుంచి

ముందుగానే కౌముది పాఠకులకోసం.. ప్రత్యేకంగా..!

సమస్య రాగానే మనం పరిష్కారం ఆలోచించటం మానేసి, విచారించటం ప్రారంభిస్తాం.

సముద్రం ఎంత పెద్దదైనా, నీళ్ళని లోపలికి రానివ్వకపోతే పడవ మునగదు. సమస్య ఎంత పెద్దదైనా, మనసులోకి రానివ్వకపోతే బాధ ఉండదు.

పాతికశాతం సమస్యలు పరిష్కారం లేనివి. పరిష్కారం లేని ఈ పాతిక శాతం గురించీ మనం జీవితంలో సగభాగం ఆలోచిస్తూ గడిపేస్తాం. ఇంకో యాభై శాతం సమస్యలు మనకి ఇతరుల వల్ల వచ్చేవి. అవి తీరాలంటే మారవలసింది వాళ్ళు. మనం కాదు. తాగుబోతు భర్త, దుబారా భార్య, గయ్యాళి అత్తగారు, చెడుదార్లో సంతానం వగైరా. వాళ్ళని మార్చటం ఎలా అని నిరర్థకంగా విచారిస్తూ మరో పాతిక శాతం కాలం గడిపేస్తాం. మిగిలిన పాతిక శాతం సమస్యల్నుంచి బయటపడాలంటే కఠినమైన నిర్ణయాలు అమలు జరపాలి. దురదృష్టవశాత్తూ ఇటువంటి సందర్భాల్లో మనం ఆలోచిస్తూ కూర్చుంటాము తప్ప నిర్ణయాలు తీసుకోము. తీసుకున్నా, అమలు జరపం.

...

ఎలాంటి నిర్ణయం తీసుకోవాలో, ఆ నిర్ణయాన్ని ఎలా అమలు జరపాలో, ఏ సమస్యకి ఎలాంటి నిర్ణయం తీసుకుంటే సమస్య తాలూకు సాంద్రత తగ్గుతుందో ఆత్మీయంగా చెప్పే పుస్తకం.

బొమ్మలు: డా. జయదేవ్

# ముందు మాట

**ఈ** పుస్తకంలోని చాలా ప్రశ్నలు నవ్య, సాక్షి మొదలైన పత్రికలలో ప్రచురింపబడినవి. కొన్ని ప్రశ్నలు, సభల్లో ఉపన్యాసం అనంతరం శ్రోతలు అడిగినవి, మరి కొన్ని మిత్రుల మధ్య జరిగిన సంభాషణలో దొర్లినవి. కేవలం రెండు ప్రశ్నలు మాత్రం సమాధానం ఇవ్వటం కోసం సృష్టింపబడినవి.

కొన్ని సమాధానాల్లో కొన్ని కొటేషన్లు, చిన్న చిన్న కథలు, సంఘటనలు, సందర్భాలబట్టి గతంలో వ్రాసిన పుస్తకాల నుంచి పునరుద్ధాటించబడినవి. వీలైనంత ఎక్కువ మంది పాఠకులకు విషయం చేరాలనే ఉదేశంతో వాటిల్ని తిరిగి ప్రస్తావించడం జరిగింది. వీటిని అంతకు ముందే చదివిన పాఠకులకు ఈ పునరుక్తి విషయమై క్షమాపణలు. ఇక్కడ, సమాధానాల కన్నా... ప్రశ్నలు ముఖ్యమని ఉద్దేశ్యం. ప్రస్తుతం యువత ఎలాంటి సమస్యలతో బాధపడుతోందన్న విషయం తెలియజెప్పటంకోసం, జవాబుల్ని పునరుక్తీకరించటం జరిగింది. అదే విధంగా, కాపీ రైట్ లేని ఇంటర్నెట్ బొమ్మలు కొన్ని వాడుకోవటం జరిగింది. ఆ అజ్ఞాత కళాకారులకి కృతజ్ఞతలు.

చివరిగా ఒక మాట.

ఈ ప్రపంచంలో ఏ ఇద్దరి అభిప్రాయాలూ ఒకలా ఉండవు. ఇందులోని కొన్ని అభిప్రాయాలు కొంతమందికి నచ్చకపోవచ్చు. మరి కొందరికి కడుపులో దేవినట్టుగా కూడా అనిపించవచ్చు. ముందే చెప్పినట్టు ఎవరి అభిప్రాయాలు వారివి. దీనికోసం వాదనలు, ప్రతివాదనలు అనవసరం. వాదించేటప్పుడు మనం అవతలి వారిని అర్థం చేసుకోవటానికి వినం. మనం గెలవటానికి వీలుగా జవాబు ప్రిపేర్ చేసుకుంటూ వింటాం. ఇద్దరు రెచ్చిపోయి దీర్ఘంగా వాదించుకుంటున్నారంటే, అందులో ఒకరు మూగ, మరొకరు చెవిటి.

మూగ వాడికి అందరూ చెవిటి వాళ్ళలాగా కనబడతారు. చెవిటి వాడికి ప్రపంచమంతా మూగగా ఉన్నట్టు అనిపిస్తుంది. అర్థం – పర్థం లేని వాదనల పరమార్థం ఇదే.

వాదనలో గెలవటానికి అత్యుత్తమ సాధనం చిరునవ్వు. ఇతరులతో వచ్చే చాలా సమస్యల్ని 'నవ్వు' పరిష్కరిస్తుంది. 'మౌనం' సమస్యల్ని రాకుండా చేస్తుంది.

–రచయిత.

## న్యాయబద్ధం – చట్టబద్ధం

**అరుణ్‌కుమార్, హైదరాబాద్:**

**ఒంగోలులో రోటరీ క్లబ్బు వారు నిర్వహించిన సభలో, చాలా కాలం క్రితం రిలీజైన 'ఛాలెంజ్' అనే సినిమాలో హీరో, హీరోయిన్‌ల మధ్య న్యాయబద్ధమైన సంపాదనకీ, చట్టబద్ధమైన సంపాదనకీ మధ్య తేడా గురించి జరిగిన చర్చ చెప్తూ, సంపాదన 7 రకాలు అన్నారు. ఆ తరువాత టాపిక్ మారిపోయి వివరణ ఇవ్వలేదు. ఏమిటా రకాలు?**

1. నీతిమంతం – న్యాయబద్ధం: రూల్స్ ప్రకారం వ్యాపారస్తులు తమ లాభాల్లోంచి, ఉద్యోగస్తులు తమ జీతాల్లోంచి పన్నులు కడితే, ఆ సంపాదన నీతిబద్ధమైంది, న్యాయబద్ధమైంది.
2. న్యాయ రహితం – నీతి రహితం: ఒక ప్రభుత్వాధికారి లంచం తీసుకొని గవర్నమెంట్‌కి రావలసిన రాబడి తగ్గిస్తే ఆ పనులు చట్టబద్ధమయినవి కావు. నీతిరహితం కూడా.
3. చట్టబద్ధం – కానీ అనైతికం: పేషెంట్‌ని రకరకాల పరీక్షలు చేయించుకోమని ఒక డాక్టర్ సూచిస్తాడు. ఆ పరీక్ష చేసే సంస్థల్నుంచి అతనికి కమిషన్ లభిస్తుంది. మరొక ఉదాహరణలో, "మునిగిపోతూన్న" కంపెనీ షేర్లు కొనమని ఒక బ్రోకరు తన కస్టమర్‌కి సలహా ఇస్తాడు. అతడికి 'కిక్ బ్యాక్స్' లభిస్తాయి. ఇవన్నీ చట్టబద్ధమైన సంపాదనలే కానీ నీతిమంతమైనవి కావు. అయిదు సంవత్సరాలు పూర్తి అవుతు ఉండగా, తిరిగి ఎన్నికల సమయంలో పార్టీ తరఫున ప్రచారానికి వెళ్ళే ఎమ్మెల్యేమంత్రి/, ఆ రెండు మూడు నెలలూజీతం ... ఎలా తీసుకుంటాడు? రాజీనామా చేసి ప్రచారానికి వెళ్ళాలి కదా.
4. చట్టరహితం – అమానుషం: అడవిలో తమ పనులు నిరాటంకంగా సాగటం కోసం ఫారెస్ట్ గార్డ్ ని చంపటం, గనులున్న ప్రదేశాన్ని ఖాళీ చేయించటం కోసం ఒక మైనింగ్ మాఫియా ఆ ప్రాంతపు గిరిజనుల గుడిసెలు తగలబెట్టటం, విటుల్ని ఆకర్షించమని బ్రోకరు ఒక స్త్రీని శారీరకంగా హింసించటం చట్టరహితం, రాక్షసం.
5. చట్ట విరుద్ధం – కాని న్యాయబద్ధం: భారతదేశంలో డాక్టర్లు ప్రకటనలివ్వకూడదు. 'ఫలానా ఆస్పత్రిలో చేరండి' అని రోడ్డు ప్రక్కన బోర్డులు పెట్టకూడదు. కాని కొత్తగా ప్రాక్టీసు పెట్టే డాక్టర్లకి గానీ, కొత్త ఆస్పత్రులకి గానీ ప్రకటనలు అవసరమేకదా! ఏ మాత్రం న్యాయబద్ధంగా ఆలోచించినా ఇది కరక్టే అని తోస్తుంది కానీ, అది చట్టవిరుద్ధం.
6. చట్ట బద్ధ – రాక్షస కృత్యం: "చట్టబద్ధమైన" రాక్షస కృత్యాలు కూడా వుంటాయా? ఉంటాయి. రాబడి కోసం కొన్ని బీద దేశాలు పెద్ద పెద్ద కంపెనీలకి తొత్తులుగా మారి, తమ దేశంలో చిన్న పిల్లల్ని బాల కార్మికులుగా మారుస్తాయి. చైల్డ్ లేబర్‌ని చట్టబద్ధం చేస్తాయి. నైజీరియా లాంటి దేశాల్లో 'షెల్ ఆయిల్' అక్కడి తాగునీటిని పాడుచెయ్యటమే కాకుండా, పది మంది పిల్లల్లో ఒకరు చిన్న వయసులోనే అనారోగ్య కారణాల్తో మరణించటానికి కారణమౌతుంది. అది తెలిసికూడా ప్రభుత్వాలు చూసీ చూడనట్టు ఊరుకుంటాయి. ప్రకృతి పరిరక్షణ సమితి వారి న్యాయబద్ధ పోరాటాన్ని 'షెల్' పోలీసులు అణగదొక్కేస్తారు. ప్రభుత్వమే వారిని నియమిస్తుంది. బహుళజాతి కంపెనీల ప్రాపకం కోసం కొన్ని దేశాలు ఈ విధంగా పాకులాడతాయి. ఇది చట్టబద్ధమైన దుర్మార్గం.
7. నమ్మకం మీద సంపాదన: ఇది నీతిబద్ధమో, న్యాయబద్ధమో చెప్పలేని స్థితి. బాబాలూ, దొంగ స్వాములూ చేసేది. ప్రజలయొక్క నమ్మకం మీద సంపాదించే ఈ మార్గాలు పట్టుబడనంత సేపు న్యాయబద్ధం మైనవి, దొరికిపోతే జైలుపాలు చేసేవి. ఒక గుడినో, ధ్యాన కేంద్రాన్నో స్థాపించి చుట్టుపక్కల స్థలాల ధరలు పెంచటం, ఎందుకూ పనికిరాని ఒక వ్యక్తికి కొన్ని మహిమలు నేర్పి బాబాగా తయారు చెయ్యటం మొదలైనవి కొంత మంది ఎన్నుకున్న కొత్త మార్గాలు.

డబ్బు సంపాదించటానికి ఇన్ని కళలు కావాలా, వేషాలు వెయ్యాలా, అమాయకులని మోసం చేయాలా, అనుక్షణం భయపడుతూ బ్రతకాలా – అన్నది ఎవరికి వారు నిర్ణయించుకోవలసిన విషయం.

ఒక చోట ఓషో అంటాడు "డబ్బు అవసరమే. కానీ చాలా మంది మనుష్యులు అవసరానికన్నా అధికమైన డబ్బు కోసం, అధికారం కోసం, గుర్తింపు కోసం, గౌరవం కోసం ఎన్నో పాట్లు పడుతూవుంటారు. వీళ్ళంతా లోపల ఎంతో 'ఖాళీ' వున్నవారు. నానా చెత్తా పోగు చేసి ఆ ఖాళీలో నింపుతూవుంటారు. ఎంత నింపినా అది శూన్యంగానే వుంటుంది. అలా కాకుండా, తనలోని శూన్యాన్ని ఆత్మసంతృప్తితో నింపేవాడే జీవితంలో సుఖంగా ఉంటాడని బుద్ధుడి సూక్తి. బుద్ధుడి సూక్తుల్ని ఆచరించిన వారెవ్వరూ అసంతృప్తితో బ్రతకరు. ఆత్మ సంతృప్తి కోసం కాకుండా కోరికతో తపస్సు చేసే ఋషులు కూడా స్వార్ధపరులే. స్వర్గపు ఉద్యానవనాల్లో మిగతావారి కన్నా ఖరీదైన భవనం కోసం; ఊర్వశి మేనకల కన్నా అందమైన స్త్రీ కోసం, మేలు జాతి గుర్రాలు పూన్చిన రథం కోసం వాళ్ళు తపస్సు చేస్తూవుంటారు. వాళ్ళకి స్వర్గం లభించదు. మరుజన్మలో వారు పదవి లేని నాయకులుగా పుడతారు. "

| నైతిక విలువలు – జీవన సుఖాలు |
|---|

## నన్నపనేని. సామర్లకోట:

**నేను మీ పుస్తకాలకి అభిమానిని. ప్రస్తుతం సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాను. మీ పుస్తకాల్లో మీరు 'రేపు మరింత సుఖంగా జీవించడం కోసం ఈరోజు కష్టపడటమే జీవితం (విజయం)' అని వ్రాశారు. నేను ప్రస్తుతం చేస్తున్న ఉద్యోగం నాకు సుఖాన్నిస్తుంది (డబ్బే ఇంధనం కదా జీవితానికి). కానీ నాకు నచ్చటము లేదు. నా నమ్మకాలకి వ్యతిరేకంగా పని చేస్తేనే ఆ 'సుఖం' నాకు లభిస్తుంది. ఇలా నమ్మకాలకీ, మరింత సుఖపడటానికి మధ్య సంఘర్షణ ఏర్పడినప్పుడు ఎలా సమన్వయపరచుకోవాలి? ఏదో ఒకదాన్ని వదులు కోవలసిందేనా? ఇంకేమైనా పరిష్కారం ఉందా? ఎప్పటిలానే లాజికల్ సొల్యూషన్ ఇస్తారని ఆశిస్తున్నాను.**

'నైతిక విలువల్ని వదులుకోవాలా, సుఖాన్ని వదులుకోవాలా' అన్నది మీ ప్రశ్నగా నాకర్థమయింది.. ముందొక విషయాన్ని స్పష్టంగా అర్థం చేసుకోండి. 'విలువల్ని వదులుకుంటేనే డబ్బు సంపాదన' అన్న మీ అభిప్రాయం తప్పు. ఇక సంతృప్తి గురించి ఆలోచిద్దాం. '...నా ఉద్యోగం నాకు సుఖాన్నిస్తుంది కానీ సంతృప్తినివ్వట్లేదు' అని వ్రాశారు. హొటల్లో మనం ఇడ్లీ తింటున్నప్పుడు, పక్కవాడి పూరీని చూసి, తప్పు నిర్ణయం తీసు కున్నామేమో అని బాధపడితే తింటున్న ఇడ్లీ ఏమాత్రం సంతృప్తినివ్వదు.



ఒక పని సంతృప్తి ఇవ్వకపోవటానికి కారణాలు మూడు రకాలు. ఒకటి: శారీరకంగా మనం ఆపని చేయలేకపోయినప్పుడు పని సంతృప్తి ఇవ్వదు. ఉదాహరణకి, రోగంతో బలహీనమైన వ్యక్తి రైల్వే కూలీగా పని చేస్తే, చాలా బాధపడవలసి ఉంటుంది. రెండు: మానసికంగా ఆ పని ఇష్టం లేకపోయినప్పుడు పని సంతృప్తినివ్వదు. ఉదాహరణకి సృజనాత్మకత ఉన్న ఒక కళాకారిణి బ్యాంక్‌లో రొటీన్ ఉద్యోగం చేయవలసి వచ్చినప్పుడు చాలా నిరాసక్తత ఆవహిస్తుంది. మూడు: చేస్తున్న పనికీ, తన సిద్ధాంతాలకీ నిరంతర ఘర్షణ జరుగుతున్నప్పుడు. మీ సమస్య మూడోదే అనుకుంటున్నాను. సాఫ్ట్‌వేర్ ఉద్యోగంలో కూడా లంచాలూ, కమీషన్లూ ఉంటాయి. ఇలాంటి గొడవ మనసులో ఒకసారి మొదలవకూడదే కానీ, ప్రారంభమయితే మాత్రం అది మర్రి చెట్టులాగా ఎదిగి పోతుంది.

ఉదాహరణకి, పక్క సీట్లో కూర్చుని లంచాలు తీసుకుంటున్న వ్యక్తి రోజు రోజుకీ ధనవంతుడవటం చూస్తూ ఉంటే, నైతిక విలువల పట్ల నమ్మకం ఉన్న వ్యక్తికి "తనకున్న నైతిక విలువ గొప్పదా? ధనం విలువ గొప్పదా?" అని సంఘర్షణ మొదలవుతుంది.

మీ సమస్య ఇదే అయితే ముందొక నిర్ణయం తీసుకోండి. "చెరువులో నీళ్ళు నచ్చకపోతే బయటకు వచ్చి చచ్చిపో, కానీ జీవితాంతం ఆ నీళ్ళలోనే ఈదొద్దు" అని చేపపిల్లకి సలహా ఇచ్చినట్టు సలహా ఇవ్వలేను కానీ, సుఖం అనేది రెలిటివ్ టర్మ్. దానికి అంతులేదు. డబ్బు నిశ్చయంగా సుఖాన్ని ఇస్తుంది. కానీ ఆనందాన్ని ఇస్తుందన్న గ్యారంటీ లేదు. ప్రస్తుతం మీరు బ్రతకటానికి లోటు లేదు కదా. నిరంతరం "నేను చాలా మంచి వాడిని. అందుకే నాకు ఇన్ని బాధలు" అని మనసులో సంఘర్షిస్తూ ఉంటే మీకు ఎప్పటికీ ఆనందం దొరకదు. నైతిక విలువలు కోల్పోమని నేను మిమ్మల్ని ప్రోత్సహించట్లేదు. ఘర్షణని వదులుకొని జీవించమని చెపుతున్నా నంతే. లంచం పొందటానికి వీలున్న కుర్చీలో కూర్చొన్ని కూడా నిజాయితీగా బ్రతికేవాడి మొహంలో ప్రశాంతత; విలువలు కోల్పోయిన వ్యక్తి మొహంలో ఉండదు. కష్టపడి సంపాదించే డబ్బు సంతృప్తినిస్తుంది. ఇది నేను నా అనుభవంతో చెపుతున్న మాట. నైతికవిలువలు కోల్పోకుండా కూడా డబ్బు సంపాదించవచ్చు. ఇది ఆఖరి సూత్రం.

## రాములు, రంపచోడవరం

**ఈ ప్రపంచంలో నిజాయితీకి చోటు లేదనిపిస్తోంది. నీతిని నమ్మిన నాలాటివాళ్ళు అలాగే ఉండి పోతున్నారు. అక్రమార్కులు కోట్లకి పడగెత్తుతున్నారు. నేను నిజాయితీగా బ్రతకటాన్ని ఇష్టపడతాను. అందుకే ఇలా ఉండిపోయాను. నా చుట్టూ ఉండే వాళ్ళని చూస్తూ ఉంటే డిప్రెషన్ కలుగుతోంది. డబ్బు కోసం ఏ పనికైనా రెడీ. నాకు ఏమి చెయ్యాలో సలహా ఇవ్వండి. ఇంట్లో పోరు ఎక్కువైంది.**

తాను ఆర్థికంగా వెనుకబడి వుండిపోవటానికి కారణం ఈ సమాజమనీ, లంచగొండితనంతో పుచ్చిపోయిన వ్యవస్థలో 'తెలివికీ, కష్టానికీ, మంచికీ' చోటులేదనీ ***మైండ్‌పవర్*** అనే పుస్తకంలో సుబ్బారావ్ అనే వ్యక్తి బలంగా నమ్ముతాడు. ఆ పై భగవంతుడి నించి కొన్ని శక్తులు పొంది దేశాన్ని సంస్కరించటానికి పూనుకుంటాడు. అతని అతీంద్రియశక్తులవల్ల నేరస్థులూ, లంచగొండులూ, టాక్సులు ఎగ్గొట్టేవారూ, చివరికి ఎర్రలైటు వెలిగినప్పుడు రోడ్డు క్రాస్ చేసేవారు కడుపు నొప్పితో విలవిలలాడి పోతారు. దేశం సుభిక్షమవుతుందని అనుకుంటాడు. అవదు. అల్లకల్లోలమవుతుంది. కొన్ని కోట్లమంది సైనికులూ, పోలీసులూ, న్యాయవాదులూ, ఇన్‌కమ్-టాక్స్ అధికారులూ నిరుద్యోగులవుతారు. వ్యాపారస్తులకి బ్లాక్ మనీ, రాజకీయనాయకులకి సంపాదన, ఉద్యోగులకి పై రాబడీ వుండదు. కాబట్టి బార్లూ, స్టార్ హోటళ్ళూ ఖాళీగా వుంటాయి. పాపభీతి పోవటంతో గుళ్ళకి రద్దీ తగ్గిపోతుంది.

ఇందులో నీతి ఏమిటంటే... సమాజం మారితే సరే. మారక పోతే ఏంచేయాలి? ఉన్న వ్యవస్థలోనే వీలైనంత వరకూ నిజాయితీగా సంపాదించుకోవాలి. లంచగొండులూ, అవినీతిపరులూ ఉండొచ్చుగాక! కానీ డబ్బు సంపాదించటానికి ఇప్పుడున్నన్ని అవకాశాలు గతంలో ఎన్నడూ లేవు. అబ్దుల్ కలాం (రాయల్టీస్), దీరూభాయ్ (పరిశ్రమలు), ఎమ్మెస్ ధోనీ (ఆటలు), నారాయణ మూర్తి (కంప్యూటర్స్) నిజాయితీగా సంపాదించిన వారే కదా! కావల్సిందల్లా తనలో ఎటువంటి శక్తి వున్నదో గ్రహించే అవగాహన, ఎక్కడ తవ్వితే డబ్బు జల పడుతుందో తెలుసుకునే శక్తి.

తనలోని అటువంటి అంతర్గతశక్తిని తెలుసుకున్న ఒక వ్యక్తి యథార్థగాథ ఏ పుస్తకంలో వ్రాశానో గుర్తు లేదు. చదవండి. నగరంలో అద్దె భరించలేక అతడు ఊరి పొలిమేరలో వుండేవాడు. పిల్లలు స్కూల్‌కి ఆటోలో వెళ్ళేవారు. ఇంతలో తోటి ఉద్యోగి ట్రాన్స్‌ఫర్ మీద వెళ్తూ అతడికి తన స్కూటర్ అమ్మేసాడు. దాంతో అతడు ఆటో మాన్పించి పిల్లల్ని స్కూటర్ మీద దింపసాగాడు. వారి స్కూల్ కూడా అతడి ఆఫీసు దగ్గిరే కానీ, అది ప్రొద్దున్న ఎనిమిదింటికి..! అంత దూరం వెనక్కి వెళ్ళటం ఇష్టం లేక ఆఫీసు పక్కనే చిన్న గది అద్దెకి తీసుకుని ట్యూషన్స్ చెప్పటం ప్రారంభించాడు. తనలో అంత గొప్ప టీచింగ్ స్కిల్స్ వున్నాయని అతడికి తెలియదు. త్వరలోనే అతడు ఆ ఏరియాలో పాపులర్ అయ్యాడు. సాయంత్రం మరో రెండు గంటలు కొనసాగించాడు. ఆర్నెల్లు గడిచేసరికి, ఆఫీసులో ఎనిమిది గంటలు పని చేస్తే వచ్చే డబ్బుకన్నా

– గంట ట్యూషన్ మీద వచ్చే డబ్బు ఎక్కువని గ్రహించి, ఉద్యోగం మానేసి భార్యతో కలిసి కోచింగ్ సెంటర్ ప్రారంభించాడు. ప్రస్తుతం అతడు కోట్లు విలువగల సంస్థలకి ఛైర్మెన్.

**మణికంఠ, మెయిల్:**

**నా వయసు 24. మంచి ఆడిటర్ ని కావాలని సీఏని ఓ పవిత్రమైన వృత్తిగా భావించి ఎంచుకున్నాను. కానీ ఆర్టికల్ షిప్ చేస్తున్న సమయంలో నాకు ఆ వృత్తి మీద అసహ్యం ఏర్పడింది. 2013లో నేను మా గ్రామ సర్పంచ్ గా ఎన్నికయ్యాను. అందులో ఓట్ల కోసం మద్యం, డబ్బు కూడా భాగమయ్యాయి. నేను వద్దన్నా మా నాన్నగారు వాటిని పంచారు. నిజాయితీగా బతకాలని, వచ్చింది రూపాయి అయినా దాన్ని నీతిగానే సంపాదించాలనేది నా అభిలాష. కానీ నా చుట్టూ అవినీతే కనిపిస్తోంది. సేంద్రీయ వ్యవసాయం, ఆధ్యాత్మిక విషయాలంటే నాకు చిన్నప్పట్నుంచీ పిచ్చి. కానీ వ్యవసాయం అమ్మానాన్నలకు ఇష్టం లేదు. అందరిలా నన్నూ దర్జాగా బతకమని పోరుతుంటారు. దాంతో నాకు నచ్చినట్టు నేను బతకలేకపోతున్నాను. అది నన్ను నలిపేస్తోంది. నా సమస్యకు పరిష్కారం చెప్పండి.**

మీరు ఆర్టికల్‌షిప్ చేస్తున్న సమయంలో మీ యజమాని అవలంబించే విధానాలు చూసి మీకు సీ.ఏ. వృత్తి మీద అసహ్యం ఏర్పడి ఉండవచ్చు. లేదా, అంత కష్టమైన కోర్సు చదవలేని మీ అసక్తతకి 'అసహ్యం' అని పేరు పెట్టుకుని ఉండవచ్చు. ఏది నిజమో మీరే మనస్సాక్షిగా ఆలోచించుకోండి. కేవలం మీకు నచ్చలేదు కాబట్టి, సీ.ఏ. అనేదే ఒక అపవిత్రమైన వృత్తిగా భావించటం తగదు. నేనూ చార్టర్డ్ ఎకౌంటెంట్‌నే...! సంపాదించటానికి ఎన్నో అవకాశాలున్న ఆర్థిక సంస్థల్లో పదిహేను సంవత్సరాలు పని చేసినా పైసా లంచం స్వీకరించలేదు. ఇప్పుడు ప్రైవేటు ప్రాక్టీసు చేస్తున్నాను. పైసా ఇవ్వలేదు. కాబట్టి చార్టర్డ్ ఎకౌంటెన్సీ అంటే తప్పకుండా లంచంతో కూడిన వృత్తి అనే అభిప్రాయాన్ని మార్చుకోండి. నిజాయితీగా బ్రతకాలనీ, నీతిగా సంపాదించలన్నదే మీ అభిలాష అయితే కాదన్నది ఎవరు? మీ చుట్టూ అవినీతి కనిపిస్తూ ఉండవచ్చు. కానీ మీరు నిజాయితీగా బ్రతకవచ్చు కదా.

వీలైనంత వరకూ వ్యక్తిత్వాన్ని పెంచుకోవటానికి ప్రయత్నించండి. ఎవరి ట్యూన్‌కో నాట్యం చేస్తున్నంత కాలం జీవితం మన చేతుల్లో ఉండదు. ముందు ఆర్థిక స్వాతంత్రం సంపాదించండి. సేంద్రీయ వ్యవసాయం, ఆధ్యాత్మిక విషయాలు మీ అభిరుచి. కానీ మీరు మీ తల్లిదండ్రుల మీద ఆధారపడి ఉన్నంతకాలం వారు, తమ అభిప్రాయాలకు అనుగుణంగానే బ్రతకమని మిమ్మల్ని వత్తిడి చేస్తూనే ఉంటారు. జీవితంలో అన్నిటికన్నా దౌర్భాగ్యకరమైన విషయం తనకు నచ్చినట్టు బ్రతకలేకపోవటం. ఒక వైపు 'మద్యం, డబ్బూ పంచాను' అని వ్రాశారు. మరోవైపు 'నిజాయితీగా బ్రతకటం నాకిష్టం' అన్నారు. పరస్పర విరుద్ధమైన అభిరుచులూ కోరికలూ పెట్టుకోకుండా, కేవలం ఒకే గమ్యం వైపు సాగండి. విలువలు, వాస్తవాలు... ఆ రెంటికీ తేడా ఎక్కువయ్యే కొద్దీ మనిషి మానసికంగా కలతపడతాడు. ఒక పని చేస్తూ, మరో వైపు దాని పట్ల అసహ్యం పెంచుకుంటే జీవితం నరకమే అవుతుంది. విజయం అంటే "బ్రతుకుతున్న జీవితవిధానం పట్ల పూర్తి సంతృప్తితో ఉండటం".

ఇంతకన్నా గొప్ప నిర్వచనం నాకింతవరకూ దొరకలేదు.

కెరియర్

**అక్షర, హైదరాబాద్:**

**నేను డిగ్రీ పూర్తి చేశాను. పాటలు పాడటం నాకిష్టం. నాకిష్టమైన రంగంలో రాణించాలని ఉంది. హైద్రాబాదు వచ్చి సినీ రంగంలో ప్రయత్నించాలని నా అభిలాష. కానీ నా తల్లిదండ్రులు అందుకు ఒప్పుకోవడం లేదు. వాళ్లు చెప్పిన రంగంలోనే అడుగిడాలని బలవంతం చేస్తున్నారు. నాకది ఏమాత్రం ఇష్టం లేదు. 'నేను దాన్ని ఎంజాయ్ చేయలేను' అని ఎంత చెప్పినా వారికి అర్థం కావడం లేదు. ఏం చేయాలో తెలియక కుమిలిపోతున్నాను. అమ్మానాన్నలకు నా బాధ అర్థమవ్వాలంటే ఏం చేయాలి?**

ప్రస్తుతం చాలా మంది యువత సమస్య ఇది. మనకు ఒక రంగంలో ఇష్టం ఉంటుంది. కానీ 'మనం ఇంకోలాగ పనిచేస్తే బాగుంటుంది' అని మన తల్లిదండ్రులకి ఉంటుంది. 'ఏమి చదవాలి?' అన్న విషయం నుంచీ ఈ విభేదాలు తలెత్తుతాయి. కొంత వరకూ మీ తల్లిదండ్రులు చెప్పింది కూడా కరెక్టే అవచ్చు కూడా. దీనికి ఉత్తమమైన పరిష్కారం మీరు మీ సంపాదన పై నిలబడగలగటం. జీవితపు ప్రారంభ దశలో మీకిష్టమైన వృత్తిని చేపట్టడం కుదరక పోవచ్చు. మీ అభిరుచికి వ్యతిరేకంగా ఇష్టంలేని వృత్తి చేపట్ట వలసి రావచ్చు. అప్పుడు: 1. ఆర్థికంగా నిలదొక్కుకోవడం కోసం ఒక ఉద్యోగంలో చేరండి. 2. తరువాత మీకిష్టమైన వృత్తిలోకి మారండి. కానీ మీకిష్టమైన వృత్తి మీకు జీవితాధారం ఇవ్వగలిగేంత ఆర్థిక వనరుల్ని సమకూర్చేది అయ్యుండాలి. 3. మీకిష్టమైన వృత్తి, ఆర్థిక వనరుల్ని ఇచ్చేంత బలమైనది కాకపోతే, బ్రతకటంకోసం మొదటి వృత్తిలోనే కొనసాగి, మరోవైపు మీ అభిరుచిని కొనసాగించండి. అప్పుడు జీవితంలో నిరాసక్తత తగ్గిపోతుంది. 4. ఒకవేళ మీ అభిరుచి, ఆర్థికపరంగా నిలదొక్కుకొనే వీలున్నదైతే కొంత కాలానికి, అదే మీ వృత్తి అవుతుంది.

తమకిష్టమైన రంగంలో పైకి వద్దామనుకునే ప్రతీవారూ తెలుసుకోవలసిన సూత్రాలు పైవి. ఇవే సూత్రాల్ని నేను కూడా అమలుజరిపాను. ఇక మీ విషయానికి వస్తే, ఈ క్రింది ఉదాహరణ మరింత స్పష్టంగా విశదీకరిస్తుంది.

1. ఒక కుర్రవాడికి పాటలు పాడే అభిరుచి ఉంది. ఆ వృత్తిలో సెటిల్ అవుదాం అనుకున్నాడు. 2. కానీ ఒక చిన్న పల్లెటూర్లో ఉద్యోగం వచ్చింది. 3. ఉద్యోగం రాజీనామా చేసి నగరానికొచ్చి ప్రయత్నాలు ప్రారంభిస్తే రెంటికి చెడ్డ రేవటి అయిపోతాడు. 4. ఉద్యోగం చేస్తూ మధ్యమధ్యలో నగరానికి రావాలి. అదృష్టాన్ని పరిశీలించుకోవాలి. స్టూడియోల చుట్టూ తిరిగి దర్శకుల్ని, నిర్మాతల్నీ కలుసు కొని తన టాలెంటు పరీక్షించుకోవచ్చు. పాటలు పాడే ట్రూపుల్లో చేరి పార్ట్‌టైంలో పాటలు పాడొచ్చు. డబ్బింగ్ అవకాశాలు కూడా పరీక్షించుకోవచ్చు. నగరంలో సెటిలవటం ముఖ్యం. 5. త్వరలోనే అతనికి తనలో వున్న విద్య, ఒక ప్రొఫెషనల్‌గా మారటానికి సరిపోతుందా, లేక అది భ్రాంతా, తనగురించి తను ఎక్కువగా అంచనా వేసుకొంటున్నాడా అన్న విషయం తెలిసిపోతుంది. 6. ప్రొఫెషనల్ అవటానికి కావలసినంత టాలెంటు తన దగ్గర లేని పక్షంలో అతడు మరింత సాధన చేయవలసి వుంటుంది. ఒకసారి బ్రేక్-త్రూ వచ్చిన తరువాత అతడి అదృష్టానికి ఆకాశమే హద్దవుతుంది. బ్రేక్-త్రూ వచ్చేవరకూ గెలుపు గది బయట వేచివుండక తప్పదు.

**బుజ్జి, మెయిల్:**

**నేను ఇంటర్ సెకెండియర్ చదువుతున్నాను. నన్ను అందరూ గుర్తుపట్టి, నాకంటూ కొందరు ఫ్యాన్స్ ఉండే రంగంలో సెటిలవ్వాలన్నది నా కోరిక. దానికి నటిని కావడమే మంచి మార్గం అనిపించింది. అందుకే సీరియళ్లలో, సినిమాల్లో ట్రై చేయాలని అనుకుంటున్నాను. కానీ అమ్మానాన్నలేమో ఇప్పుడొద్దు, చదువయ్యాక వెళ్లు అంటున్నారు. కానీ ఇప్పటి నుంచీ మొదలెడితే ఎప్పుడో ఒకప్పుడు వస్తాయి కదా! అందుకే వాళ్లకు చెప్పకుండా హైదరాబాద్ వచ్చి ప్రయత్నాలు చేయాలని అనుకుంటున్నాను. నా నిర్ణయం సరైనదేనా?**

మీ ఉద్దేశ్యం మంచిదే కానీ హైదరాబాదు వచ్చి సినిమాల్లో చేయాలంటే మీకు దగ్గరివారు, నమ్మకమైన వాళ్ళూ ఒకరు ఉండాలి. మీరు ఒంటరిగా వస్తే, మీలాంటివాళ్ళ కోసం ఇక్కడ చాలా తోడేళ్ళు రెడీగా ఉంటాయి. మీరు ఎంత తెలివైనవారైనా ఏదో ఒక బలహీన క్షణంలో తప్పటడుగు వేస్తారు. ఇక్కడ తప్పటడుగంటే నా ఉద్దేశ్యం శీలం కోల్పోవటం, వ్యభిచార గృహంలో మగ్గటంలాంటివి కాదు. సరియైన వ్యక్తి మీకు దొరకకపోవటం..!

చాలామందికి ఒక దురభిప్రాయం ఏమిటంటే చలనచిత్ర రంగంలో స్త్రీ పైకి రావాలంటే తప్పనిసరిగా హీరోకో, నిర్మాతకో, దర్శకుడికో కమిట్ అవ్వాలని. కానీ అది తప్పు. నిజంగా టాలెంట్ ఉండి తన పని తను చేసుకుపోతూ ఉంటే ఎవరూ ముగ్గులోకి లాగటానికి ప్రయత్నం చేయరు. అలా తమ పని తాము చేసుకుపోయే హీరోయిన్లు కనీసం ఇద్దరు ముగ్గురు నాకు తెలుసు. మీ ఆర్థిక స్థితి ఏమిటో, ఇంటర్మీడియెట్ చదివిన మీరు, హైదరాబాదు వచ్చి ఎలా బ్రతుకుతారో అలాంటి వివరాలేమీ వ్రాయలేదు కాబట్టి ఇంతకన్నా సమాధానం చెప్పటం కష్టం.

**కె.రమణ:**

**నేను బీటెక్ చేశాను. తర్వాత రెండేళ్లు కాంట్రాక్ట్ బేసిస్ మీద జాబ్ చేశాను. ఎంటెక్ చేయడానికి జాబ్ మానేశాను. మరో మంచి ఉద్యోగం రావడంతో మధ్యలోనే ఎంటెక్ ఆపేశాను. ఆ జాబ్లో జాయినయిన నెల రోజులకి ఎక్కడో గ్రూప్స్ గురించి చూశాను. వెంటనే ఉద్యోగం మానేసి గ్రూప్స్ కోచింగ్లో చేరాను. కానీ నాకిప్పుడు అనిపిస్తోంది.. నేను చేస్తోంది తప్పేమో అని. దేని మీదా దృష్టి పెట్టలేకపోతున్నాను. ఒకదాని నుంచి ఒకదానికి మారుతూనే ఉన్నాను. ఇలా అయితే నేను ఏం సాధించగలను? ఇలా మాటిమాటికీ మనసు మారిపోకుండా ఉండాలంటే ఏం చేయాలి?**

'రోలింగ్ స్టోన్స్ కి ద్రవ్యరాశి (మాస్) సమకూరదు' అని ఒక సామెతుంది. అదెంత నిజమో, మరో వైపు దానికి వ్యతిరేకంగా... 'కదలని మురుగు నీటికి సుగంధం ఉండదు' అన్నది కూడా అంతే నిజం. ఎవరి పరిస్థితి బట్టి వారు మెలగాలి. మనస్తత్వం బట్టి కెరియర్ని నిర్ణయించుకోవాలి. నేను పదిహేను సంవత్సరాలు ఒకే సంస్థలో మారకుండా పని చేశాను. మా అబ్బాయి పదేళ్లలో పదిహేను సంస్థలు మారి ఒక స్థాయికి వచ్చాడు. కాబట్టి ఏది కరక్ట్ అనేది ఆయా పరిస్థితుల బట్టి ఉంటుంది.

మంచి ఉద్యోగం రావడంతో మీరు ఎంటెక్ ఆపేశారు. మళ్ళీ గ్రూప్స్ కోసం ఎంటెక్ మానేసారు. ఇందులో తప్పేముంది? అయితే మీరు చేస్తున్న ఉద్యోగం, గ్రూప్స్ పాస్ అవ్వడం వల్ల వచ్చే ఉద్యోగం కన్నా మంచిదా కాదా? అనే విషయం మీరు నిర్ణయించుకోవాలి. కొన్ని లక్షల మంది గ్రూప్స్ కి చదువుతున్నారు. పాస్ అయ్యేది చాలా తక్కువ శాతం. మీకాసామర్థ్యం ఉన్నదా అన్న విషయం నిర్ణయించుకోండి. అన్నిటికన్నా ముఖ్యంగా మీ వయసెంత, మీ కుటుంబ ఆర్థిక స్తోమత ఎంత. మీమీద ఎవరైనా ఆధారపడి ఉన్నారా! మీకు వయసు మీరిపోతోందా? ఇవన్నీ ఆలోచించి... ఉద్యోగం (జీవితం)లో స్థిరపడాలా, రిస్క్ తీసుకోవాలా అనే నిర్ణయం తీసుకోండి.

**హరిత:**

**నేను మొదట్నుంచీ బాగా చదివేదాన్ని. ఇంటర్ వరకూ అన్నీ అనుకున్నట్టుగానే జరిగాయి. కానీ తర్వాత నాకు ఇష్టం లేకపోయినా బలవంతంగా నన్ను సీ.ఏ. లో చేర్పించారు. అయినా ఎలాగో కష్టపడే దాన్ని. నాన్న కోసమైనా బాగా చదవాలని ప్రయత్నించే దాన్ని. కానీ నావల్ల కాలేదు. ఫెయిలైపోయాను. దాంతో తిరిగి డిగ్రీలో చేరాను. కానీ నా జూనియర్స్ తో కలిసి డిగ్రీ చదవాలంటే బాధగా ఉంది. డిప్రెస్ అయిపోయాను. అంతలో పెళ్లి సంబంధాలు చూశారు. నన్ను అర్థం చేసుకునే ఏకైక వ్యక్తి నా ఫ్రెండ్. తనకు దూరం అవ్వడం ఇష్టం లేక పెళ్లి వద్దన్నాను. దాంతో అన్నిటికీ ఆ అమ్మాయే కారణం అంటూ అమ్మ నా ఫ్రెండ్ ను తిట్టింది. అది తట్టుకోలేక పెళ్లికి ఒప్పేసుకున్నాను. కానీ ఎందుకో చాలా బాధగా ఉంది. ఎందుకు నాకిష్టం లేనివే జరుగుతున్నయో అర్థం కావడం లేదు. ఈ బాధను నేను ఎలా అధిగమించాలి?**

ఇష్టంలేనివి జరుగుతున్నప్పుడు, జరుగుతున్నవాటిని ఇష్టంగా చేసుకోవటాన్ని 'పాజిటివ్ థింకింగ్' అంటారు. నేను చదువుకునే రోజుల్లో నాకు ఇదే సమస్య ఎదురైంది. నాకు లెక్కలు చాలా ఇంట్రెస్ట్. జువాలజీ అస్సలు ఇంటరెస్ట్ లేదు. కానీ ఇంట్లో బలవంతం మీద సైన్స్ లో చేరి, ఎంత బాగా చదివినా, మెడిసిన్లో సీట్ సంపాదించలేక పోయాను. అదృష్టవశాత్తు కామర్సుతో డిగ్రీ చదివి, ఆ తర్వాత 4 సంవత్సరాల సి.ఏ. కోర్స్ కేవలం మూడు సంవత్సరాల్లోనే పూర్తి చేసాను. మన అభిరుచి పెద్దలు అర్థం చేసుకోలేకపోతే వచ్చే సమస్య 90% కుటుంబాల్లో ఉన్నదే! పోతే మీ జూనియర్స్ తో కలిసి చదవవలసి వచ్చిందనే బాధ మీకు ఎక్కువగా ఉంటే, ప్రైవేటుగా చదివే వెసులుబాటు ఉన్నదేమో ఆలోచించండి. భవిష్యత్తులో మీరు వివాహం చేసుకుంటారా లేదా అనేది వేరే విషయం కానీ, కేవలం స్నేహితురాలికి దూరమవుతామని వివాహం వద్దనుకుంటున్న మీ ఆలోచన మాత్రం అంత ఆరోగ్యకరమైనది కాదు. కొంత కాలానికి మీ ఫ్రెండ్ కూడా పెళ్ళి చేసుకుని వెళ్ళిపోతుంది కదా! కేవలం స్నేహితురాలి గురించి వివాహం మానుకోకండి. కొన్ని వాస్తవాల్ని భరించక తప్పదు. మీకు వివాహం చేసుకోవాలనే కోరిక ఉండి,

అబ్బాయి నచ్చితే చేసుకోండి, లేదా ఇంకా చదువుకోవాలనుంటే ప్రైవేట్ గా చదువు కొనసాగించండి. అదీ గాక పోతే, వివాహం చేసుకుని చదువు కొనసాగించండి. చదువుకి వయసుకీ సంబంధం లేదు.

**రమ, హైదరాబాదు.**

**టి.వీ షోల్లో పందెం గెలిస్తే వేలకు వేలు ఇచ్చినట్టూ చూపిస్తారు కదా. అంతంత డబ్బు నిజంగా ఇస్తారా?**

కొన్ని షోల్లో తప్ప, నటులు, యాంకర్లు పాల్గొనే చాలా టి.వి. షోల్లో ముందే కాంట్రాక్టు ఉంటుంది. అదంతా కేవలం షో మాత్రమే. లక్ష రూపాయల నోట్లు ఇచ్చినట్టు చూపించి, షో పూర్తి అవగానే వెనక్కి తీసుకుంటారు. మరి కొన్నిసార్లు నిజంగానే పోటీ ఉంటుంది. అందులో కూడా కొన్నిసార్లు ఇస్తారు. కొన్ని సార్లు ఎగ్గొడతారు. 'మా' టి.వి. ఛానల్ లో ఐదు సంవత్సరాల క్రితం ఐదు వేలు గెలుచుకున్నాను. ఐదు నెలలు, ఐదుసార్లు ఫోన్ చేశాక విసుగుతో మానేయడం జరిగింది.

**బిందు, నిజామాబాద్:**

**నేను ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్నాను. నాకు సంగీతం అంటే చాలా ఇష్టం. బాగా పాడతాను. అందుకే మ్యూజిక్ లో డిగ్రీ చేయాలని ఉంది. కానీ మా నాన్నగారికి కళలపై పెద్ద ఇష్టం లేదు. అలాంటివేమీ అక్కర్లేదు, ఎమ్-సెట్ రాసి మెడిసిన్ చేయమంటున్నారు. నాకు దానిపై ఆసక్తి లేదు. మెడిసిన్ చేయాలంటే చాలా డెడికేషన్ ఉండాలి అంటారు. కానీ ఇష్టం లేనప్పుడు నేనెలా మంచి డాక్టర్ని అవ్వగలుగుతాను? ఈ విషయం నేను చెప్పలేక అమ్మతో చెప్పించాను. కానీ నాన్న వినడం లేదు. మండిపడుతున్నారు. నాకేం చేయాలో తోచడం లేదు. నాన్నకు నా బాధ అర్థమయ్యేలా మంచి సమాధానం ఇవ్వండి. అది నేను నాన్నకు చూపిస్తాను. మీలాంటివారు చెబితేనైనా ఒప్పుకుంటారని నా ఆశ. దయచేసి చెప్పండి సర్.**

మీ సమస్య అర్థవంతమయినది. అర్థమయింది.

పిల్లల స్టాండర్డ్ తెలుసుకోలేక, పెద్ద పెద్ద ఆశలతో వాళ్ళని శాసించి, అన్నివిధాలా నష్టపరిచే తల్లిదండ్రులు కోకొల్లలు. మీ నాన్నగారు కూడా అటువంటి జాబితాలో చేరటం దురదృష్టకరం. నా సమాధానం చూసి మీ తండ్రిగారు మనసు మార్చుకుంటారని అనుకోను. మీ బాధను అర్థం చేసుకోగలిగే పెద్దవారు మీ కుటుంబంలో ఇక ఎవరైనా ఉంటే వారితో మీ తండ్రికి చెప్పించండి. అప్పటికీ వినకపోతే ఎంసెట్ వ్రాయండి. సీట్ ఎలాగూ రాదుకాబట్టి ఆయనే మీ దారికి వస్తారని ఆశిద్దాం.

అయితే ఆయన తరఫు నుంచి కూడా ఒక నిముషం ఆలోచించాలి. కేవలం మ్యూజిక్‌లో డిగ్రీ సంపాదించటం వల్ల కచేరీలు చేసి ఆర్థికంగా నిలదొక్కుకోగలరా? లేదా వివాహం చేసుకుని గృహిణిగా స్థిరపడదామనుకుంటున్నారా? ప్రైవేట్‌గా గ్రాడ్యుయేషన్ చేస్తూ మ్యూజిక్‌లో డిగ్రీ చేయండి. ఒకవైపు చదువు, మరొక వైపు అభిరుచి... మంచి కాంబినేషను.

**(కొనసాగింపు వచ్చేనెల)**